# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 67 EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 6 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 67, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 6 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## ఆదివాసీల సుదీర్ఘ పోరాటం



వరంగల్- ప్రభాత సూర్యుడు

ములుగు జిల్లాలోని ఆదివాసీల సుదీర్ఘ పోరాటం ఫలించింది. తెలంగాణ హైకోర్టు వారికి అనుకూలంగా సంచలన తీర్పు వెలువరించింది. ములుగు జిల్లా మండపేట మండలంలోని 23 గ్రామాలు షెడ్యూల్ ప్రాంతాలేనని తెలిపింది. ఆ గ్రామాలు

మిగతా 2లో...

## కిషన్‌రెడ్డికి తొలి టెస్ట్
## ప్రధాని మోదీ టూర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ అధ్యక్షునికి కిషన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకం ఉన్న పళంగా అమలులోకి వస్తుందని బీజేపీ హైకమాండ్ ప్రకటించింది. ఇప్పుడు కిషన్ రెడ్డి ముందు ఉన్న లక్ష్యం ఎనిమిదో తేదీన ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయడం. తన నియామకంపై పార్టీలో నేతలెవరికీ అసంతృప్తి లేదని అందర్ని కలుపుకుని వెళ్తానని నిరూపించగలగడం. ఈ విషయంలో కిషన్ రెడ్డికి ఊహించనంతగా పరిస్థితులు అనుకూలంగా ఉండే అవకాశాలు లేవన్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర

మిగతా 2లో...

## సోషల్ మీడియాలో... కాంగ్రెస్ దూకుడు



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) 285 సీట్లతో, దాని స్వంత మెజారిటీతో అధికారంలోకి వచ్చినప్పుడు ఇతర విషయాలతో పాటు సోషల్ మీడియా దీనికి చాలా క్రెడిట్ ఇచ్చింది. ఫేస్ బుక్, యూట్యూబ్, ట్విట్టర్ వంటి వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కాంగ్రెస్‌పై బీజేపీ సాధించిన భారీ విజయంలో కీలక పాత్ర పోషించాయి. తన అభివృద్ధి నమూనాతో గుజరాత్‌ను అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లిన వికాస్ పురుష్‌గా తన ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీని ప్రదర్శించడానికి బిజెపి దానిని చాలా సమర్థవంతంగా ఉపయోగించుకుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇమేజ్ క్షీణించడానికి, అతనిని పప్పు లేదా తెలివితక్కువ వ్యక్తిగా ముద్రించడానికి పార్టీ సోషల్ మీడియాను బాగా ఉపయోగించడం కనిపించింది. ప్రేమ, యుద్ధంలో అన్నీ న్యాయమే అని 2014లో బీజేపీ పేర్కొంది..తొమ్మిదేళ్ల తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కనీసం మైదానంలో కాకపోయినా.. ఈరోజుల్లో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నది కాంగ్రెస్సే. జూన్ 2022లో కాంగ్రెస్ కొత్త సోషల్ మీడియా టీమ్‌ను ఏర్పాటు చేయడంతో ఇదంతా ప్రారంభమైంది. సుప్రియా శ్రీనాటే సోషల్ మీడియా ఛైర్‌పర్సన్‌గా, మాజీ మంత్రి జైరాం రమేశ్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ-కమ్యూనికేషన్‌గా ఉన్నారు. న్యూ ఢిల్లీలోని 15 గురుద్వారా రకబ్ గంజ్ రోడ్‌లోని వారి వార్ రూమ్‌లో ఉన్న సోషల్ మీడియా బృందంతో పాటు ఈ మలుపు తిరిగినందుకు వీరిద్దరూ అన్ని క్రెడిట్‌లకు అర్హులు..సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ ఎదుగుదలను పరిశీలిద్దాం. జూలై 2022లో పార్టీ 48 మిలియన్ల ట్విట్టర్ ఫాలోవర్లను కలిగి ఉంది. ఈ గణాంకాలు 10 నెలల తర్వాత మే 2023లో 165 మిలియన్ లకు పెరిగాయి. ఇది భారీ 243 శాతం వృద్ధికి దారితీసింది.కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ మెంబర్ ప్రకారం, ట్విట్టర్‌లో కాంగ్రెస్ ఫాలోవర్ల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. "ఇది త్వరలో 10 మిలియన్లకు చేరుకుంటుంది.. ఇది బిజెపి యొక్క 20 మిలియన్ల మంది ఫాలోవర్లలో సగం అయినప్పటికీ, బిజెపి కంటే ఎక్కువ లైకులు.. రీట్వీట్‌లను పొందుతుంది", వాస్తవాలు పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి తనిఖీ చేయవచ్చని సందీప్ యాదవ్ పేర్కొన్నారు. యూట్యూబ్, ఇన్ స్టాగ్రాం, ఫేస్ బుక్ మొదలైన ఇతర

మిగతా 2లో...

## సైలెంట్ మూడ్‌లో కమలం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను దించేసిన అధినాయకత్వం కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించారు. దీనిపై ఆయన ఇంత వరకు స్పందించలేదు. ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న ఆయన కేబినెట్

మిగతా 2లో...

## కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకే గెలుపు అవకాశం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలుగు సినిమాలను ఏపీలోనూ చిత్రీకరించినా ఎలాంటి శిక్ష లేకుండా చూడాలని తెలంగాణ సీఎం కేసీఆర్ కాళ్లకు మొక్కి మరీ అడుగుతానని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణ మురళీ తెలిపారు. ఏపీలో ఉచితంగా సినిమాలు తీసుకోవచ్చని చెప్పారని.. అలా అని అక్కడ షూటింగ్ చేస్తే తెలంగాణ స్థలాలిచ్చాం కదా, అక్కడికి ఎందుకు వెళ్లారని అని అడుగుతున్నారని మంగళవారం రోజు జరిగిన వెలగపూడి ప్రెస్ మీట్ లో ఆయన చెప్పారు. అలాగే తెలంగాణలోనే ఉంటే ఏపీలో స్థలాలు ఇస్తామన్నా ఎందుకు ఉండరని అంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి తెలుగు సినీ పరిశ్రమకు కటింగ్, ఫిటింగ్ అయిపోందంటూ కామెంట్లు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇష్ట పడితేనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. అలాగే సీఎం కేసీఆర్ ను మనసారా అడిగితే కచ్చితంగా ఆయన సాయం చేస్తారని పోసాని కృష్ణ మురళీ వివరించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నారని.. భవిష్యత్తులో కేసీఆర్ కుమారుడు కేటీఆర్.. ఆ తర్వాత టీపీసీసీ చీఫ్ .

మిగతా 2లో...

## రూ.155 చేరుకున్న టమోటా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కొంత కాలంగా టమాటా ధర రోజురోజుకూ పెరిగిపోతుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కూరగాయలు ధరలు విపరీతంగా పెరగడంతో.. సామాన్య ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారు. రోజూ ఏం వండుకోవాలో తెలియకు.. కారం మెతుకులతోనే పూట గడిపేస్తున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాల కారణంగా రవాణాకు తీవ్ర అంతరాయం కల్గడంతో

మిగతా 2లో...

## మూడు వర్గాలుగా విడిపోయిన తెలంగాణ బీజేపీ

### రెండు వర్గాలు సోషల్ మీడియా వార్.. మూడో వర్గం మాత్రం సైలెంట్లో...



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ రెండు వర్గాలుగా విడిపోయి మరీ సోషల్ వార్ నిర్వహిస్తోంది. నిజానికి తెలంగాణలో ప్రస్తుతం మూడు వర్గాలు ఉన్నాయి. వాటిలో రెండు వర్గాలు సోషల్ మీడియా వేదికగా వార్ జరుపుతున్నాయి. మూడో వర్గం మాత్రం సైలెంట్. సోషల్ మీడియాలో ఎవరికి వారే పోస్టులు పెడుతున్నారు. మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ కు మద్దతుగా బీజేపీ క్యాడర్ పోస్టులు పెడుతోంది. బండి ం

మిగతా 2లో...

## నిబంధనలకు తూట్లు.. విద్యార్థుల భవితకు పోట్లు



- అక్రమ నిర్మాణాలలోనే స్కూళ్ల ఏర్పాటు
- అనుమతులు లేకుండానే పాఠశాలల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు, తల్లిదండ్రులకు తప్పని వేధింపులు
- అధికారుల అండదండలతోనే రెచ్చిపోతున్న యాజమాన్యాలు
- పట్టించుకోని అధికారులు




అమీన్‌పూర్/సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :

నిబంధనలకు తూట్లు పొడుస్తూ..ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అవుతున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బందంకొమ్ము వెళ్లే ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవంతిలో పాఠశాల నిర్వహణ అనుమతులు లేకుండాలనే.. నిర్వహిస్తు్న వ్రిహా స్కూల్‌తో ఇటు విద్యార్థుల తల్లిదండ్రులకు, అటు ఇతర స్కూళ్ళకు తిప్పలు తప్పడంలేదు. విద్యాసంస్థలు నిర్వహించాలటే తప్పనిసరి ప్రభుత్వ అనుమతులు పొంది, విద్యాశాఖ మార్గదర్శకాలు ఖచ్చింతంగా పాటించాల్సి ఉంటుంది. కానీ ఈ వ్రిహా స్కూల్ అందుకు విరుద్ధం.

మిగతా 2లో...

## కిషన్‌రెడ్డికి తొలి టెస్ట్
# ప్రధాని మోదీ టూర్

(మొదటిపేజీ తరువాయి)
మోడీ ఈ నెల 8వ తేదీన తెలంగాణకు రానున్నారు. వారణాసి నుంచి నేరుగా హైదరాబాద్‌కు వస్తారు. 8వ తేదీన ఉదయం 9.45 గంటలకు ఆయన వారణాసి నుంచి హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10.35 గంటల కల్లా వరంగల్‌లో దిగుతారు. ఉదయం 10.45 గంటల నుంచి 11.20 గంటల వరకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారు. వరంగల్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ కాజీపేట వ్యాగన్ ఓవర్‌హాలింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల తర్వాత వరంగల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు బహిరంగ సభలో ఆయన పాల్గొనబోతున్నారు. బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు వరంగల్ నుంచి తిరిగి హకీంపేట్‌కు వెళ్లుతారు. అక్కడి నుంచి ఢిల్లీకి తిరిగి వెళ్తారు. మోదీ వరంగల్ పర్యటనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బండి సంజయ్ చీఫ్ గా ఉన్నప్పుడే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పుడు ఆయన మాజీ అయ్యారు. కిషన్ రెడ్డి బాధ్యతలు తీసుకుంటున్నారు. అయితే ఏర్పాట్లపై ఎలాంటి ప్రభావం పడకుండా.. జన సమీకరణ విషయంలో ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బహిరంగసభ ను విజయవంతం చేయడానికి కిషన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. పార్టీ నేతలందరితో మాట్లాడుతున్నారు. ప్రధాని సభకు తెలంగాణ బీజేపీ అగ్రనేతలందరూ హాజరు కావడంపై సస్పెన్స్ నెలకొంది. రాజగోపాల్ రెడ్డికి ఎలాంటి పదవి ప్రకటించలేదు. దీంతో ఆయన తిరిగి కాంగ్రెస్ లోకి వెళ్లే ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. బీజేప సభకు ఆయన హాజరయ్యే అవకాశం లేదంటున్నారు. అలాగే మరికొందరు నేతలు కూడా బండి సంజయ్ ను మార్చడంపై అసంతృప్తితో ఉన్నారు. ఈటల రాజేందరే కాదని.. తాను కూడా ఉద్యమం చేశానని విజయశాంతి వాపోయారు. తెలంగాణ కాంగ్రెస్ లో ప్రచార కమిటీ చైర్మన్ పదవి వదులుకుని బీజేపీలోకి వచ్చినా ఆమెకు ఎలాంటి పదవి ఇవ్వడం లేదు.

# ఆదివాసీల సుదీర్ఘ పోరాటం

(మొదటిపేజీ తరువాయి)
రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ కిందకే వస్తాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేడు తీర్పును వెలువరించారు. దీంతో 75 ఏళ్ల పాటు ఆదివాసీలు చేసిన పోరాటం ఫలించింది. ఇక, ఇందుకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఆదివాసీల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వారు ఐదు షెడ్యూల్ పరిధిలోకి రారని ఆదివాసీయేతరులు వాదనలు వినిపించారు. అయితే ఇందుకు సంబంధించి గతంలో సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. ఆదివాసీయేతరుల అప్పీల్‌ను కొట్టివేసింది.కొండలపై అడవుల మధ్య జీవిస్తున్నారు. కల్మషం లేని మనసు వారిది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఆదివాసీల జీవన స్థితిగతుల్లో చెప్పుకోదగ్గ మెరుగుదల లేదు. నేడు, అనేక గిరిజన గ్రామాలు వైద్యం, విద్య మరియు ప్రాథమిక మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఆదివాసీలు బతుకు పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. వారి నివాసాలు ఒకప్పుడు సహజ వనరులతో సమృద్ధిగా ఉండేవి. అనేక దేశాల్లో ఆదివాసీలకు ఇప్పటికీ తగిన గుర్తింపు మరియు రక్షణ లేదు. అడవి తల్లి ఒడిలో సహజ వనరులను కాపాడుకోవడంలో గిరిజనులు చేస్తున్న కృషి ఎనలేనిది. సహజ వనరుల పరిరక్షణ కోసం ఆదివాసీల సహకారం, పోరాటం గొప్పది. ఆధునిక సమాజంలో కొత్త పోకడలతో దూసుకెళ్తున్నా.. ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ తమ ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు అందిస్తున్నారు. ఇటువంటి ఆదివాసీయుల కళ ఎట్టకేలకు నెరవేరింది. 75 ఏళ్ల పాటు ఆదివాసీలు చేసిన పోరాటం నేటితో ఫలించింది. ములుగు జిల్లా మండపేట మండలంలోని 23 గ్రామాలు షెడ్యూల్ ప్రాంతాలేనని కోర్టు తీర్పుతో ఆదివాసీలకు పండగవాతావరణం నెలకొంది.

## సోషల్ మీడియాలో
# కాంగ్రెస్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)
సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కూడా కాంగ్రెస్ వృద్ధి పెరుగుతోంది. ఉదాహరణకు, యూట్యూబ్ లో, జూలై 2022లో 21 మిలియన్ల నుంచి మే 2023 నాటికి 51 మిలియన్లకు పెరిగినట్లు పార్టీ పేర్కొంది. ఇన్‌స్టాగ్రాం ఇది జూలై 2022లో 1.25 మిలియన్ల నుంచి మే 2023 నాటికి 20 మిలియన్లకు చేరుకుంది. ఇది 1290 శాతం వృద్ధి.. ఫేస్‌బుక్‌లోనూ ఇదే కొనసాగుతోంది. జూలై 2023లో 13 మిలియన్ల మంది అనుచరులు ఉండగా, ఈ ఏడాది మే నాటికి పార్టీ దాదాపు 16 మిలియన్లకు పెరిగింది.ఈ పెరుగుదలకు కాంగ్రెస్ వివిధ కారణాలను ఆపాదిస్తోంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర భారీ ఆదరణ పొందింది. పార్టీ వివిధ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో కూడా ఇది కనిపిస్తుంది. అయితే యాత్ర ముగిసిన తర్వాత కూడా ఆ ఊపును నిలబెట్టుకోగలిగిన ఘనత కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ ది.వర్చువల్ స్పేస్‌లో కాంగ్రెస్ ఎదుగుదలకు సుప్రియా శ్రీనాట్ 'దూకుడు వ్యూహం' మరొక ముఖ్యమైన అంశం. "ఆమె రాజకీయ సంఘటనలు.. వాటి చిక్కులను చాలా నిశితంగా పరిశీలించేవారు. పార్టీకి లేదా మన నాయకులకు వ్యతిరేకంగా బిజెపి సోషల్ మీడియాలో వ్యాప్తి చేసే అబద్ధాలు, బూటకాలను ఆమె త్వరగా తిప్పికొడుతుంది. ఇంతకుముందు, మేము వారి అబద్ధాలను పట్టించుకునేవారం కాదు.. లైట్ తీసుకునేవారం.. ఇప్పుడు అలా లేదు.. ", అని ఒక కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.సోషల్ మీడియాలో పార్టీ ఎదుగుదల క్షేత్రస్థాయిలో కూడా పార్టీ ఎదుగుదలకు అద్దం పడుతోందని కాంగ్రెస్ నేత, మాజీ అధికార ప్రతినిధి రషీద్ అల్వీ అన్నారు. 'బీజేపీ అబద్ధాలు చెబుతోందని, విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని దేశ ప్రజలు ఎట్టకేలకు గుర్తించారు. బీజేపీని బట్టబయలు చేసి ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ వైపు మళ్లుతున్నారు. సోషల్ మీడియాలో పార్టీ బాగా పనిచేయడానికి అదే అతిపెద్ద కారణం ఇదే.."అని అల్వీ కొత్త సోషల్ మీడియా బృందానికి కూడా క్రెడిట్ ఇస్తూ అభిప్రాయపడ్డారు.ఇంతలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కాంగ్రెస్ వాదనలు లేదా వారి సంఖ్యలపై బిజెపి పలు విమర్శలు చేస్తోంది. బీజేపీ ఢిల్లీ అధికార ప్రతినిధి హరీష్ ఖురానా ప్రకారం, కాంగ్రెస్ అన్ని రకాల వ్యూహాలతో ముందుకుపోతుంది.. వారి వాదనలు నమ్మదగినవి కావు. "ఇష్టాలు.. అనుచరులను కొనుగోలు చేయడంలో మునిగిపోయే కాంగ్రెస్‌లా కాకుండా, సోషల్ మీడియాలో బిజెపి వృద్ధి నిజమైనది. అంతేకాకుండా పార్టీకి సోషల్ మీడియా ప్రచార వేదికలలో ఒకటి. మేము ఇంటింటికీ ప్రచారం.. మైదానాల్లో పని చేయడంపై నమ్మకం ఉంచాము. అందుకే మాకు 303 మంది ఎంపీలున్నారు' అని ఖురానా అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకే గెలుపు అవకాశం

(మొదటిపేజీ తరువాయి)
రేవంత్ రెడ్డిలు సీఎంలు అవుతారని అన్నారు. ఇలా వ్యవస్థ జరిగిపోతుందని.. అయితే ఇప్పుడు తెలంగాణ భవిష్యత్తు కేసీఆర్ తో ముడిపడి ఉందన్నారు. ఆయనకు చిత్ర పరిశ్రమ బాధలు అన్నీ చెప్పి ఒప్పిస్తే ఏపీలోనూ సినిమాలు తీసుకునేలా సాయం చేస్తారని స్పష్టం చేశారు. అదే జీవో పెడితే చించి బయట పడేసి.. మీకు ఇష్టం లేకపోతే తెలంగాణ నుంచి వెళ్లిపోండని అంటారని.. అదే జరిగితే మనం ఏ చేస్తామంటూ ప్రశ్నించారు. అందుకే మెల్లిగా, బతిమాలుతూ మాట్లాడుకొని పని చేయించుకోవడం మంచిదని చెప్పారు.అలాగే రోజు రోజుకూ దేశ వ్యాప్తంగా కళాకారుల సంఖ్య తగ్గిపోతుందని.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో మరింత తక్కువయ్యారని అన్నారు. ఈ క్రమంలోనే పద్య నాటకాలకు ఊపిరి పోయాలని తాము నిర్ణయించుకున్నట్లు పోసాని కృష్ణ మురళీ వెల్లడించారు. పద్య నాటక పోటీలకు బుధవారం రోజు నోటిఫికేషన్ కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పద్య, సాంఘిక నాటకాలు, నాటికలు, బాలల నాటికలు, యువత నాటికలకు సంబంధించి ఐదు విభాగాల్లో 73 అవార్డులు ఇస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో ఏపీఎఫ్డీసీ వెబ్ సైట్ ద్వారా .. అన్ని రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఈ నెలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తులను ఉప సంహరించుకోవడానికి వారం రోజులు గడువు కూడా ఇస్తామని స్పష్టం చేశారు. నాటక సమాజాలు ఎక్కడ తమ కళారూపాలు పదర్శించాలని అనుకున్నాయో.. అక్కడికే జ్యూరీ వెళ్లి చూస్తుందని తెలిపారు. అయితే ప్రాథమిక పరిశీలనలో ఎంపిక అయిన సమాజాలు వారం రోజుల పాటు నాటికలను ప్రదర్శిస్తారని స్పష్టం చేశారు. విజేతలకు ఏడో రోజు అవార్డులను అందజేస్తామని ఏపీఎఫ్టీవీడీసీ ఎండీ టి. విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు

## నిబంధనలకు తూట్లు...
# విద్యార్థుల భవితకు పోట్లు

(మొదటిపేజీ తరువాయి)
అరకోర సదుపాయాలు, ఆట స్థలం ఉండదు, అధిక ఫీజుల వసూళ్ళు, అర్హతలేని ఉపాధ్యాయులు..ఇవన్నీ ఆ పాఠశాల సొంతం. విద్యను వ్యాపారంగా మార్చి నిర్వహిస్తున్న ఇలాంటి పాఠశాలలు ఎన్నో..! కొందరైతే విద్యా సంవత్సరం ప్రారంభంలో నూతనంగా పాఠశాలలను ఏర్పాటు చేసి..ఫీజులు వసూళ్ళు చేసి, కొన్ని రోజులకే వాటిని పలు కారణాలతో మూతపడే స్థితికి తీసుకొస్తారు, లేదా ఇతర యాజమాన్యాలకు అమ్ముకొని పోతారు. దీంతో విద్యార్థుల భవిశ్యత్ రోడ్డున పడుతుంది. మళ్ళీ తర్వాతి సంవత్సరం అదే తంతు..అదే కోవకు చెందిన వాటిలో ఈ వ్రిహా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే స్కూలు యాజమాన్యం గతంలో నిర్వహించిన విబ్జియార్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను వ్యక్తిగత కారణాలతో అమ్ముకొని మళ్ళీ వ్రిహా స్కూల్ పేరుతో కొత్త అవతారం ఎత్తారు. గతంతో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ఉన్న సంబంధంతో వ్యాపారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న వ్రిహా స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి ఆయోమయానికి గురిచేస్తున్నారు. దీంతో సక్రమంగా నిర్వహిస్తున్న పాఠశాలలు సైతం గందరగోళానికి గురవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇలాంటి విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అయోమయానికి గురిచేస్తున్నారు**

గతంలో నిర్వహించిన విబ్జియార్ స్కూల్ యాజమాన్యం (ప్రస్తుత వ్రిహా స్కూల్ యాజమాన్యం) నాకు ఫోన్ చేసి ఆ స్కూల్ త్వరలో మూతపడుతుంది. మీ పిల్లల చదువులు అర్థాంతరంగా నిలిచిపోతాయి. మా వ్రిహా స్కూల్‌లో చేర్పించండి అని అయోమయానికి గురిచేస్తున్నారు.

-- మల్లేష్ (ఇద్దరు విద్యార్థుల తండ్రి)
అమీన్‌పూర్, ఫోన్: 81424 32394

**చర్యలు తీసుకుంటాం**

సదరు వ్రిహా స్కూల్‌కు ఎలాంటి విద్యాశాఖ అనుమతులు లేవు. దీనిపై తక్షణమే చర్యలు చేపడుతాం. మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇలాంటి పాఠశాలలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

-- రాంథోడ్
మండల విద్యాధికారి, అమీన్‌పూర్ మండలం

# రూ.155 చేరుకున్న టమోటా

మెట్రో నగరాల్లో టమాటా ధరలు మరింత అధికం అయ్యాయి. కోల్ కతాలో కిలో టమాటా ధర రూ.155కు చేరగా.. ముంబయిలో రూ.58, ఢిల్లీలో రూ.110, చెన్నైలో రూ.117గా టమాటా ధరలు ఉన్నాయి. కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం దేశంలో టమాటా సరాసరి ధర కిలోకు రూ.83.29గా ఉంది. బీహార్ రాజధాని పాట్నాలో క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయలు కిలో రూ.60 చొప్పున లభిస్తున్నాయి. ఇదొక్కటే కాదు పశ్చిమ బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కూడా కూరగాయల ధరల విపరీతంగా పెరిగాయి. మే నెల ప్రారంభం అయినప్పటి నుంచి పాట్నాలో కూరగాయల ధరలు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. టమోటా ధర గరిష్టంగా పెరిగిన చోట ఇతర కూరగాయలు కూడా ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. క్యాలీ ఫ్లవర్, క్యాబేజీ నుంచి బెండకాయ వంటి కూరగాయల ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. మే నెలలో కిలో రూ.40 ఉన్న క్యాలీ ఫ్లవర్ ఇప్పుడు కిలో రూ.60కి చేరగా.. మేలో 30 రూపాయల నుంచి 40 రూపాయలు పలికిన క్యాబేజీ ప్రస్తుతం రూ.60కి పెరిగింది. బంగాళ దుంప, ఉల్లి ధరలు మే నెలలో కిలో రూ.20 ఉండగా జూలైలో కిలో రూ.30 నుంచి 35కి పెరిగాయి.కూరగాయలతో పాటు పండ్ల ధరలు పెరుగుతున్న రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కూడా ఒకటి. ఈ రాష్ట్రంలో కూరగాయల ధరలు 30 నుంచి 35 శాతం పెరిగాయి. వారం రోజుల క్రితం కిలో రూ.150 ఉన్న పచ్చిమిర్చి ఇప్పుడు కిలో రూ.300 నుంచి 350కి చేరింది. మరోవైపు టమాట కిలో ధర రూ.130 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు.ఒడిశాలో గత 15 రోజులుగా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. టమోటాలు కిలో రూ.140 నుంచి 160 మధ్య ఉండగా, పచ్చిమిర్చి కిలో రూ.200 పలుకుతోంది. అల్లం ధర కిలో రూ.300 పలుకుతోంది.ఢిల్లీలోని సఫాల్ స్టోర్‌లో కూడా టమాటా కిలో రూ.129 పలుకుతుండడంతో ఇక్కడి ప్రజలు ఈ కూరగాయల కొనుగోలును తగ్గించారు.ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో టమాటా ధర కిలో రూ.150కి చేరుకుంది. పెరుగుతున్న టమాటా ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. ఈ విషయంలో ఏదైనా చేయాలని, తద్వారా సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మహారాష్ట్రలో పంట నష్టం జరిగింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేయడంతో టమాటా ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ఏడాది సాధారణం కంటే 30 శాతం పంట దిగుబడి తక్కువగా ఉందని కోలార్ కు చెందిన రైతులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే టమాటా ధరలు చాలా ఎక్కువ అని చెప్పవచ్చు.

## సైలెంట్ మూడ్‌లో
# కమలం

(మొదటిపేజీ తరువాయి)
మీటింగ్‌కి కూడా హాజరుకాలేదు. ఆయన రాజీనామా చేశారని కొందరు, చేయబోతున్నారని మరికొందరు చెబుతున్నారు.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి మార్పు అందర్నీ షాక్‌కి గురి చేసింది. బండి సంజయ్‌ను తప్పిస్తారంటూ ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ పుకార్లు అంటూ కేంద్ర అగ్రనాయకుల నుంచి రాష్ట్ర నాయకుల వరకు అంతా ఖండించారు. బండి సంజయ్ ఆధ్వర్యంలోనే ఎన్నికలను పేస్ చేయబోతున్నట్టు పదే పదే చెబుతూ వచ్చారు. మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయన్న టైంలో బీజేపీ అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. బండి సంజయ్‌ను తప్పించి కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించింది. దీనిపై బీజేపీ నాయకులే బహిరంగ విమర్శలు చేస్తున్నారు. బండి సంజయ్ సహా కొందరు సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కొని పార్టీని పరుగులు పెట్టించిన వ్యక్తిని కాకుండా కిషన్ రెడ్డిని నియమించడం సరికాదని చాలా మంది బీజేపీ లీడర్లు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రత్యర్థుల విమర్శలకు బలమిచ్చారని అంటున్నారు. ఆయనతో బీజేపీ అధికారంలోకి రావడం సాధ్యం కాదని చాలమంది అభిప్రాయపడుతున్నారు. కిషన్ రెడ్డి వ్యతిరేక వర్గం అభిప్రాయం అలా ఉంటే... ఆయన సన్నిహితులు మరో వాదన వినిపిస్తున్నారు. కేంద్రమంత్రి పదవి వదులుకొని మళ్లీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేయడం కిషన్ రెడ్డికి కూడా ఇష్టం లేదని అంటున్నారు. ఆయన దృష్టి జాతీయ రాజకీయాలపై ఉందని.. జాతీయ అధ్యక్షుడు అవ్వాలని కోరిక ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే పార్టీ తనకు రాష్ట్ర పగ్గాలు అప్పగించినప్పటికీ ఆయన స్పందించలేదు.

ఇప్పటి వరకు అధినాయకత్వం నిర్ణయంపై స్పందించని కిషన్ రెడ్డి బుధవారం జరిగిన కేంద్రమంత్రివర్గం భేటీకి కూడా వెళ్లలేదు. ఢిల్లీలోనే ఉన్నప్పటికీ ఆయన మీడియా ముందుకు రావడం లేదు. ఈ నిర్ణయాలు ప్రకటించకముందే మంగళవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడరు. మార్పు చేర్పులపై కూడా ఏం సమాధానం చెప్పలేదు. అధ్యక్ష పదవిని తీసేశారని బండి సంజయ్, అధ్యక్ష పదవి తనకు వద్దని కిషన్ రెడ్డి ఇద్దరూ అసంతృప్తిగానే ఉన్నారు. వీళ్లిద్దరి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మిగతా నాయకులు కూడా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఇప్పుడు తెలంగాణ బీజేపీ మొత్తం సైలెంట్ మోడ్‌లో ఉంది. ఈటల రాజేందర్, రఘునందన్‌రావు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో ఈ ఉదయం కేంద్రకేబినెట్ సమావేశమైంది. ఈ భేటీకి కిషన్ రెడ్డి గైర్హాజరయ్యారు. దీంతో ఆయన రాజీనామా చేశారని కొందరు రాజీనామా చేయబోతున్నారని మరికొందరు చెబుతున్నారు. ఆయన మాత్రం దీనిపై స్పందించడం లేదు.

కిషన్ రెడ్డి మోదీ ప్రభుత్వంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్నారు. 2020లో రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ నియమితులయ్యారు. ఆయన కరీంనగర్ ఎంపీగా ఉన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్సెస్‌ఫుల్‌గా చేపట్టారు బండి సంజయ్. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేశారు. తన పదవీకాలంలో పాదయాత్ర, వివిధ నిరసనలు, ఆందోళనల్లో పాల్గొని తనదైన ముద్ర వేశారు. కొందరు నాయకులను కలుపుకొని వెళ్లడంతో విఫలమయ్యారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఎన్నికల ముందు ఆయన్ని తప్పించారని టాక్. మొత్తానికి అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం ఏ వైపునకు దారి తీస్తుందో అన్న టెన్షన్ మాత్రం పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకుల్లో కనిపిస్తోంది.

## మూడు వర్గాలుగా
# విడిపోయిన తెలంగాణ బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)
సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించటాన్ని ఈ వర్గం తప్పు పడుతోంది. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ పదవి రావటంతో.. సోషల్ మీడియాలో ఈటల వర్గ సంబరాలు చేసుకుంటోంది. కేంద్ర మంత్రి, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వర్గం మాత్రం సైలెంట్‌గా ఉంది. రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తర్వాత తెలంగాణ బీజేపీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి.బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నానన్నారు. "బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కి అభినందనలు. అనుభవజ్ఞులైన, సమర్థులైన మీ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి మీరు కృషి చేస్తారని ఆశిస్తున్నాను" అని బండి సంజయ్ తెలిపారు.

## సంపాదకీయం

### టీ కప్పులో తుఫానుగా
# అంతర్యుద్ధం

రష్యాలో వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ నిరాకరించడమే ఈ తిరుగుబాటుకు కారణమని అంచనా. ఉక్రెయిన్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండొచ్చు.నెపం రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టడం మంచి వ్యూహం. అయితే ఈ తిరుగుబాటు వల్ల ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత నిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి రష్యాకు ఏర్పడింది. వాగ్నర్ గ్రూపు లాంటి కిరాయి దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావొచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే!వాగ్నర్ తిరుగుబాటు ఉక్రెయిన్‌పై పోరు విషయంలో రష్యా తన పరిస్థితిని పునఃసమీక్షించుకునేందుకు పురిగొల్పవచ్చు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, రష్యా ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. తిరుగుబాటుకు మాత్రమే కాకుండా... అంతే వేగంగా అది సమసిపోయేందుకు కారణాలేమిటన్న దానిపై పెద్ద ఎత్తున ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని తప్పుడు అంచ నాల వల్ల జరిగిందా? లేదా పనిగట్టుకుని కుట్రపూరితంగా వెలుగు లోకి వచ్చిన విప్లవమా? వాగ్నర్ కమాండర్ యెవ్‌గెనీ ప్రిగోజిన్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికీ దోస్తులేనా? ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయి సాధించలేకపోవడంతో ఆఫ్రికా కార్యకలాపాల్లో నిమగ్నమైన వాగ్నర్ మూకలను రష్యా రప్పించాల్సి వచ్చింది. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా, బాగా డబ్బున్న కిరాయి సైనికుడైన ప్రిగోజిన్ సారథ్యంలో నడుస్తున్న వాగ్నర్ గ్రూపు 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను లాక్కోవడంలో రష్యాకు బాగా ఉపయోగపడింది. ప్రపంచానికి దీని గురించి తెలిసింది కూడా అప్పుడే. ఆ వెంటనే అమెరికా వాగ్నర్ గ్రూపు, ప్రిగోజిన్ లపై ఆంక్షలు ప్రకటించింది. వాగ్నర్ గ్రూపు దాదాపు ఇరవై దేశాల్లో రష్యా ప్రయో జనాలను కాపుకాస్తూ వచ్చింది. అయితే, మొజాంబిక్ లోని కాబో డెలగాడోలో చొరబాటుదారులను అణచడంలో విఫలమైంది. చివరకు అక్కడ రువాండా దళాలు శాంతి భద్రతలను పునఃస్థాపించాయి. లిబియా, సూడాన్ , మాలి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఇలా పలు దేశాల్లో వాగ్నర్ గ్రూపు చురుకుగా పని చేసింది. అప్పటికే అక్కడున్న ( ఫ్రెంచి దళాలను తరిమేయడం లేదా అంతర్గత కుమ్ములాటల్లో ఒక పక్షం వహించడం వాగ్నర్ గ్రూపు చేసిన పనులు. ప్రధాన లక్ష్యం మాత్రం రష్యా మద్దతిచ్చిన సంస్థలకు దన్నుగా నిలవడం. ఈ పను లకు ప్రతిఫలంగా వాగ్నర్ గ్రూపునకు రష్యా ఆయుధాల సరఫరా జరుగుతుంది. బంగారం ఇతర సహజ వనరుల వెలికితీతకు సంబంధించిన వాటిల్లో మిన హాయింపులు లభిస్తాయి. ఈ నేపథ్యంలోనే వాగ్నర్ గ్రూపును ఉక్రెయిన్ పై యుద్ధానికి దింపింది రష్యా. ఫలితంగా ఆఫ్రికా దేశాల్లో ఈ గ్రూపు కార్యకలాపాలు ఆగిపోయాయి. ఉక్రెయిన్ బక్‌ముట్ నగరంలో వాగ్నర్ గ్రూపు యుద్ధ సామర్థ్యానికి పుతిన్ ప్రశంసలు కూడా లభించాయి. యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను ఇచ్చేందుకు రష్యా నిరాకరించడమే ప్రిగోజిన్ తిరుగుబాటుకు కారణ మని కొంతమంది విశ్లేషకుల అంచనా. బక్‌ముట్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇది కాస్తా వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండవచ్చు. నెపం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టేందుకు ప్రయత్నించడం మంచి వ్యూహం. ప్రిగోజిన్ మిలిటరీ స్థావరమైన రొస్తోవ్‌ను చేజిక్కిం చుకునే విషయంలో దాదాపు విజయం సాధించాడు. ఆ వెంటనే తన తిరు గుబాటును బహిరంగం చేసేశాడు. అంటే, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యా పరిస్థితిలో ఏదో తేడా ఉంద న్నమాట. ఇందుకు తగ్గట్టుగానే రష్యా రక్షణ మంత్రిత్వ శాఖలో సమూల ప్రక్షాళన జరగా లని కోరుతున్న వారూ కొందరు ఉండటం గమనార్హం.. వాగ్నర్ ఉదంతం నుంచి పాఠాలు కూడా నేర్చుకోవాలి. ఇలాంటి ప్రత్యేక దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే. కాబట్టి వీటిపై మరింత కఠినమైన నియంత్రణ అవసరమవుతుంది. రానున్న కొన్ని నెలల్లో రష్యా సైనిక దళం పుతిన్ రాజకీయ ఆకాంక్షలకు తగ్గట్టుగా మెరుగైన ప్రదర్శన కనపరచగలదా అన్నది కూడా ఒక ప్రశ్న.ఉన్నతస్థాయిలో మార్పులు చేస్తే వ్యూహాలు, పద్ధతులకు మార్పులు, చేర్పులు అనివార్యమవుతాయి. ఎఫ్ఎస్‌బీ, రక్షణ మంత్రిత్వ శాఖలు సమన్వ యంతో పని చేయడం ఇప్పుడు పుతిన్‌కు అవసరం. వాగ్నర్ గ్రూపు సైనికుల్లో అధికులు ఇప్పటికీ రక్షణ శాఖతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశ ముంది. ఎంతైనా ఇవి దంచనుగా డబ్బులు తీసుకుంటూ పనిచేసే కిరాయి సైన్యాలే కదా? కానీ వీరు సాధారణ సైనికుల మాదిరిగా క్రమశిక్షణతో వ్యవహరించగలరా? ఆఫ్రికా దేశాల్లో రష్యా ప్రయోజనాలు కాపాడే ప్రాజెక్టులతో అటు రక్షణ శాఖకూ, ఇటు వాగ్నర్ గ్రూపునకూ ఆర్థిక దన్ను ఇచ్చే సామర్థ్యం ప్రిగోజిన్ కు ఉంది. అయితే రక్షణ శాఖ ఈ నిధులను దుర్వినియోగం చేస్తోందన్నది ప్రిగోజిన్ ఆరోపణ. ఇప్పుడు ప్రిగోజిన్ బహిష్క రణ ముప్పును ఎదుర్కొం టున్నారు. వాగ్నర్ గ్రూపు మానవ నష్టాన్ని చవి చూసింది. మిగిలిన వాళ్లు సమర్థంగా పని చేయాలంటే ఏం చేయాల న్నది ఆసక్తికరంగా మారింది. ఏమైనప్పటికీ రానున్న ఎనిమిది నెలల్లో వాగ్నర్ గ్రూపు తన వారిని, రష్యా సైనికుల కార్య చరణకు అనుగుణంగా పనిచేసేలా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఉక్రె యిన్ కూడా తన ప్రతిదాడులను కొనసాగిస్తూనే ఉంది. రష్యా దీటు గానే తట్టుకుంటోంది కూడా. కానీ ప్రిగోజిన్ సృష్టించిన ప్రకంపనలు కాస్తా రష్యా వ్యవస్థలోని లోటుపాట్లను ఎత్తి చూపినట్లు అయ్యింది.

# చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే వరకు గడ్డం, వెంట్రుకలు తీయం

- చెప్పులు వేయం
- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నేతలు దీక్ష
- ఫ్యాక్టరీ తెరిచే వరకు పోరాటం ఆగదు



**జగిత్యాల -ప్రభాత సూర్యుడు :** ముత్యంపేట చక్కర ఫ్యాక్టరీ తెరిపించే వరకు గడ్డం వెంట్రుకలు తీయమని, చెప్పులు వేయమని రైతులు ప్రతిజ్ఞ చేశారు.. ముత్యం పేట చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలంటూ రైతులు, సాధన సమితి సభ్యులు దీక్ష పట్టారు. బుధవారం కొండగట్టులో అంజన్న కు తలనీలాలు సమర్పించిన చెరుకు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు మామిడి నారాయణ రెడ్డి చక్కెర ఫ్యాక్టరీని తెరిపించే వరకు చెప్పులు ధరించకుండా, గడ్డం, తల వెంట్రుకలు తీయకుండా, మద్యం, మాంసం ముట్టకుండా దీక్ష కొనసాగిస్తానని ప్రతిన బూనారు. గ్రామంలోని రైతులను చైతన్య పరుస్తానని నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో రైతులకు ఫ్యాక్టరీ తెరిపిస్తామని నాయకులు హామీఇస్తూ మోసగిస్తున్నారని వారి కళ్ళు తెరిపించాలని అంజన్నను కోరినట్లు తెలిపారు. చక్కెర ఫ్యాక్టరీ సాధన సమితి నాయకుడు చెన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా తో పాటు నిజామాబాద్ జిల్లా రైతులకుఅందుబాటులో ఉండే ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ మూత పడటం వల్ల రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. ఉపాధి లేక ఎంతో మంది గల్ఫ్ బాట పట్టి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. రైతులను జాగృతం చేసేందుకు గ్రామ గ్రామాన పర్యటిస్తామని సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. వీరి ఉద్యమానికి గల్ఫ్ జేఏసీ రాష్ట్ర నాయకుడు గుగ్గిల్ల రవి గౌడ్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు చెన్నమనేని శ్రీనివాసరావు, రైతు నాయకులు వాకిటి సత్యం రెడ్డి, గురిజల రాజి రెడ్డి, పన్నాల తిరుపతి రెడ్డి, కంది బుచ్చి రెడ్డి, ప్రవీన్, కొత్తపేట గంగారెడ్డి, అనీల్ తోపాటు పలువురు ఉన్నారు.

# ఎల్ అండ్ టీ చేయకపోతే మేమే చేస్తాం

**హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు :** ప్రతి సంవత్సరం ప్రోగ్రెస్ రిపోర్ట్ ను విడుదల చేయడం ఆనవాయితిగా పెట్టుకున్నాము అని మంత్రి కేటీఆర్ అన్నారు. నేడు తొమ్మిది సంవత్సరాల రిపోర్ట్‌ను విడుదల చేశాము అని ఆయన పేర్కొన్నారు. ఇది సమగ్రమైన నివేదిక.. హైదరాబాద్, తెలంగాణలోని మున్సిపాలిటిలు బాగా పని చేస్తున్నాయి అనడానికి మాకు కేంద్రం నుంచి వచ్చిన అవార్డులే నిదర్శనం అని కేటీఆర్ అన్నారు. నూతన మున్సిపల్ చట్టాన్ని తీసుకువచ్చి ఇంత అబివృద్ధికి సీఎం కేసీఆర్ గారి కృషియే కారణమన్నారు.గత తొమ్మిది సంవత్సరాలలో 1,21,294 కోట్లు ఖర్చు చేసాము.. గత ప్రభుత్వాలు మున్సిపటీల కోసం 26 వేల 211కోట్లు ఖర్చు చేశామని మంత్రి కేటీఆర్ తెలిపారు. 91.8 శాతం స్టేట్ గవర్నమెంట్ నుంచి ఖర్చు చేస్తే, 9,934 కొట్లు మాత్రమే కేంద్రం నిధులిచ్చింది అని ఆయన వెల్లడించారు. 2004 నుంచి 2014 వరకు రూ. 4, 636 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. 44 వేల కోట్లు జీహెచ్ఎంసీ కోసం రూ. 18 వేల కోట్లు వాటర్ కోసం ఖర్చు చేశామన్నారు. బల్దియాలో ఎన్నో కొత్త ఆలోచనలు చేసాము.. గతంతో పోలిస్తే.. ఇప్పుడు గుణాత్మకమైన మార్పు సాధించాము అని కేటీఆర్ అన్నారు.రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో టెండర్ దశలో ఉంది అని ఆయన పేర్కొన్నారు. హెచ్ఆర్డీసీఎల్ ద్వారా లింక్ రోడ్స్ ఏర్పాటు చేసాము.. మెయిన్ రోడ్స్ మంచిగా ఉండాలని సీఆర్ఎంపీని తీసుకుని వచ్చామని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో రోడ్లు బాగైనాయి.. బాంబే కూడా మన సీఆర్ఎంపిని ఆదర్శంగా తీసుకొని అక్కడ టేకప్ చేస్తున్నారు. రాష్ట్రంలో 20 వేల లీటర్ల మంచి నీటిని ప్రతి ఇంటికి అందించాము అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సెప్టెంబర్ వరకు 100 శాతం మురుగును శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్ ను నిలుపుతాం. 2024 వరకు చెత్త ద్వారా 101 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాము.. రూ. 261 కోట్లతో లిచెట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకున్నాము.. దేశంలో ఎక్కడాలేని విధంగా ఎఫ్ఎస్ టీపీలను ఏర్పాటు చేసుకున్నాము అని మంత్రి చెప్పుకొచ్చారు.రాష్ట్రానికి 50 శాతం ఆదాయం పట్టణాల నుంచి వస్తుంది అని మంత్రి కేటీఆర్ అన్నారు. అభివృద్ధి కోసం పెట్టే ఖర్చు అప్పు కాదు, అది ఆ నగర భవిష్యత్తు పెట్టుబడి.. ప్రతీ చోట మార్పు స్పష్టంగా కనబడుతుంది. మన నగరాన్ని మనమే శుభ్రంగా ఉంచుకోవాలి.. 2014లో నగరం ఎలా ఉంది ఇప్పుడు ఎలావుందీ అనేది చూడండి.. రెండు స్కై వేల కోసం రక్షణ శాఖ భూములను ఇవ్వమని ఇప్పటి వరకు ఐదుగురు రక్షణ మంత్రులను అడిగాము.. 150 ఎకరాల భూమి అవసరం.. పాతబస్తీ మెట్రోను ఎల్ అండ్ టినీ పూర్తి చేయకపోయినా.. మేమే దాన్ని నిర్మిస్తాం.. మెట్రో కోచ్ లను పెంచాలని ఎల్ అండ్ టిని కోరాము.. మెట్రో, ఆర్టీసీ, ఆటోలు, ఉబర్ అన్నింటినీ అనుసంధానం చేస్తూ కార్డు తేవాల్సిన అవసరం ఉంది అని మంత్రి కేటీఆర్ అన్నారు.

# గజ్వేల్ ఘటనలో 11 మంది అరెస్ట్

**మెదక్ -ప్రభాత సూర్యుడు :** గజ్వేల్ పట్టణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో సిద్దిపేట సీపి శ్వేతా స్పందించారు. మీడియా సమావేశం సీపీ శ్వేతా మాట్లాడుతూ.. గజ్వెల్‌లో నిన్న,మొన్న జరిగిన ఇష్యూలో ఇప్పటికి 11 మందిని అరెస్ట్ చేసామన్నారు. వారిని 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లుగా తెలిపారు. నిన్న ఎలాంటి అనుమతి లేకుండా గజ్వేల్ పట్టణంలోకి వచ్చి ర్యాలీగా వెళ్లిన చీకోటి ప్రవీణ్ పై కేసు నమోదు చేశామ న్నారు. సోసియల్ మీడియాలో వచ్చిన అసత్యపు వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. సోషయల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గజ్వేల్‌లో ప్రశాంత వాతావరణం నెలకొందని.. ఇక ముందు కూడా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునేకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు.మంగళవారం ఓ వ్యక్తి మద్యం మత్తులో శివాజీ విగ్రహం ముందు మూత్ర విసర్జన చేసిన విషయం సోషల్ మీడియాలో పెద్ద రచ్చ జరిగింది. ఈ ఘటనతో గజ్వేల్ ఒక్కసారిగా ఆందోళనలు మొదల య్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు శివాజీ విగ్రహం కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఆ వ్యక్తిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం స్టేషన్ నుంచి శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. తిరిగి వస్తుండగా ర్యాలీలో పాల్గొన్న ఇద్దరిపై గుర్తు తెలియనివారు దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చీకోటి ప్రవీణ్ పై కేసు, క్యాసినో వ్యవహారంలో చీకోటి ప్రవీణ్ సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.. ఇప్పుడు మరోసారి తెరపైకి చీకోటి ప్రవీణ్ రావడంతో హాట్ టాపిగ్ గా మారింది. చీకోటి ప్రవీణ్ పై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా నిన్న గజ్వేల్ పట్టణానికి వచ్చి ర్యాలీగా వెళ్లిన చీకోటి ప్రవీణ్ పై కేసు నమోదు చేశారు గజ్వేల్ పోలీసులు.గజ్వేల్ పట్టణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలపై సిద్దిపేట సీపీ శ్వేత స్పందించారు. గజ్వేల్‌లో నిన్న, మొన్న జరిగిన ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేసినట్లు సీపీ శ్వేత మీడియా సమావేశంలో తెలిపారు. వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఎలాంటి అనుమతి లేకుండా నిన్న గజ్వేల్ పట్టణానికి వచ్చి ర్యాలీగా వెళ్లిన చీకోటి ప్రవీణ్ పై కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గజ్వేల్‌లో ప్రశాంత వాతావరణం ఉందని.. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలు సహకరించాలన్నారు. నిన్న (మంగళవారం) శివాజీ విగ్రహం ముందు మద్యం మత్తులో ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేయడంతో సోషల్ మీడియాలో దుమారం రేగింది. ఈ ఘటనతో గజ్వేల్‌లో ఆందోళన మొదలైంది. విషయం తెలుసుకున్న స్థానికులు శివాజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆ వ్యక్తిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం స్టేషన్ నుంచి శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తిరిగి వస్తుండగా ర్యాలీలో పాల్గొన్న ఇద్దరిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. ఈ ఘటనలో సందీప్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

### తండ్రి చొక్కా పట్టుకుని....
# సాయిచంద కుమారుడు

**హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు :** ప్రముఖ ఉద్యమ గాయకుడు, జానపద కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ గా పని చేసిన సాయిచంద్ ఇటీవల చిన్న వయసులో అంటే 39 ఏళ్ళ వయసులోనే గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మరణంతో తెలంగాణ రాష్ట్రం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. తమకు నేరుగా పరిచయం లేకున్నా ఆయన పాటతో పరిచయం ఉన్న వారందరూ సైతం కన్నీరుమున్నీరయ్యారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న సాయిచంద్ భార్య రజనీ ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. భర్తను కోల్పోయిన బాధలో ఆమె గుండె పగిలేలా రోదిస్తున్నా ఆమెను పలు యూట్యూబ్ చానెళ్ళు ఇంటర్వ్యూ చేసేందుకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయితే ఈ క్రమంలో గుండె నొప్పి రావడంతో ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలిం చారు.అయితే ఆమె కొంత కోలుకోగా తాజాగా సాయి చంద్ కుమారుడు ఫోటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ కంటతడి పెట్టిస్తోంది. భారత జాగృతి జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఐటీ ఫొరం ప్రెసిడెంట్ నవీన్ ఆచారి అనే వ్యక్తి ఈ ఫోటో షేర్ చేశారు. తండ్రి ని మర్చిపోలేక ఏడ్చి ఏడ్చి తండ్రి షర్ట్ పట్టుకొని పడుకున్న సాయిచంద్ కుమారుడు, ఈ పరిస్థితి ఎవరికి రాకూడదు. ప్రజా జీవితంలో ఉన్నవారు దయచేసి మీ ఆరోగ్యాల గురించి పట్టించు కోండి అని ఆయన పోస్టులో పేర్కొన్నారు. నిజంగానే ఆ చిన్నారి తన తండ్రి షర్టును వాటేసుకుని పడుకుని ఉండటం కనిపిస్తోంది. ఇంత చిన్న వయసులోనే తండ్రిని పోగొ ట్టుకుని ఆ చిన్నారి ఎంత గుండె కొత్త అనుభవిస్తున్నాడో అని పలువురు కామెంట్లు చేస్తున్నారు.తండ్రి ని మర్చిపోలేక ఏడ్చి ఏడ్చి తండ్రి షర్ట్ పట్టుకొని పడుకున్న సాయిచంద్ కుమారుడు. ఈ పరిస్థితి ఎవరికి రాకూడదు. ప్రజా జీవితంలో ఉన్నవారు దయచేసి మీ ఆరోగ్యాల గురించి పట్టించుకోండి.

# ఎమ్మెల్యే రఘునందన్ రావు అరెస్టు

**రంగారెడ్డి-ప్రభాత సూర్యుడు :** దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ నుంచి గజ్వేల్ కు వెళ్తున్న సమయంలో హకీంపేట వద్ద ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఆల్వాల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే గజ్వేల్ లో ఉన్న శివాజీ విగ్రహం వద్ద ఒక వ్యక్తి మూత్రవిసర్జన చేయడం కలకలం రేపింది. మూత్ర విసర్జన చేసిన వ్యక్తిని అక్కడున్న స్థానికులు అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ర్యాలీలో పాల్గొన్న ఇద్దరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో సందీప్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యారు. ఈ ఘటనతో గజ్వేల్ ఒక్కసారిగా భగ్గుమంది. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ ఆందోళన చేపట్టింది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో కూడా తప్పుడు ప్రచారం చేయవద్దని సూచించారు. ఈ నేపథ్యంలో గజ్వేల్ కు వెళ్తున్న రఘునందన్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే రఘునందన్ కు బీజేపీ ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ ఫోన్ చేసి మాట్లాడారు. మరోవైపు ఈటల మీడియాతో మాట్లాడుతూ రఘునందన్ ను అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## పార్టీ విధానానికి కట్టుబడి ఉంటాను.. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ -ప్రభాత సూర్యుడు : తెలంగాణ బీజేపీ సారథిగా సీనియర్ నేత కిషన్ రెడ్డికి అధినాయకత్వం పట్టం కట్టింది. కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది..ఈ నేపథ్యంలో తాజాగా కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో కిషన్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ విధానానికి కట్టుబడి ఉంటాను. ప్రధాని మోదీ సభ తర్వాత అధికారికంగా బాధ్యతలు తీసుకుంటాను. ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌కు వస్తాను. ఈరోజు రాత్రి 8 గంటలకు పదాధికారులతో సమావేశం జరుగుతుంది. ప్రధాని సభకు ఏర్పాట్లు చేయాలి. రెండు పదవులు నిర్వహించడం కష్టం అని కామెంట్స్ చేశారు. మరోవైపు.. కిషన్ రెడ్డితో పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ భేటీ అయ్యారు. ఇదిలా ఉండగా.. మంత్రవర్గ పునర్వ్యవస్థీకరణ సమయంలో కేంద్రమంత్రి పదవికి కిషన్‌రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది..

## కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



జగిత్యాల -ప్రభాత సూర్యుడు :సుదీర్ఘ కాలంగా పరిష్కారం కానీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి సమ్మెలోకి పోతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె పోస్టర్ ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, కో కన్వీనర్ ముడుగం రాజలింగు లు మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసేవరకు సమ్మె అగదన్నారు. కార్మికులకు అనుసరిస్తున్న మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని పనిభారం మోపి పనిచేయలేక తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్లతో సమ్మె కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో 6 వ తేదీన సమ్మె మొదలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పులి మల్లేష్, మండల నాయకులు సత్తయ్య, అంజయ్య, గణపతి, రాజేందర్, మల్లయ్య, రమేష్ తోపాటు పలువురు ఉన్నారు

## జీఎస్టీ అధికారుల కిడ్నాప్..

హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జీఎస్టీ సీనియర్ ఆఫీసర్ మణిశర్మ కిడ్నాప్ ఉదంతం కలకలం రేపింది. దిల్ షుఖ్ నగర్ లోని కృష్ణానగర్ లో ఫేక్ జీఎస్టీ నేపథ్యంలో ఒక వెల్డింగ్ షాప్ ను సీజ్ చేసేందుకు జీఎస్టీ ఆఫీసర్ మణిశర్మ,ఆనంద్ వెళ్లారు. షాప్ నిర్వాహకుడితో పాటు మరో నలుగురు .ఇన్నోవా కార్ లో అధికారి మణిశర్మ , ఆనంద్ లను కిడ్నాప్ చేసారు. కారులో అధికారుల ఐడెంటి కార్డులను లాక్కుని చింపివేసారు. తరువాత వారిని విడుదల చేయాలంటే ఐదు లక్షల రూపాయలను డిమాండ్ చేసారు. బాధితులు విషయాన్ని వారి ఉన్నతాధికారులకు తెలిపారు. వారు పోలీసులకు పిర్యాదు చేయండతో పోలీసులు రంగంలోకి దిగి వాహానాల చెకింగ్ ప్రారంభించారు. ఘటనాస్థలికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే కారును పట్టుకున్నారు. జీఎస్టీ అధికారులు ను రక్షించారు. అయితే ఇద్దరు అధికారులపై తీవ్రంగా దాడి జరిగినట్లు సమాచారం. నలుగురు నిందితులు దొరికారు. ప్రధాన నిందితుడు ఖయ్యూం పరారీలో వున్నాడు

## అర్ధరాత్రి హైనా సంచారం..

**కుక్కపై దాడి..భయాందోళనతో గ్రామస్తుల పరుగులు**

కరీంనగర్-ప్రభాత సూర్యుడు : కరీంనగర్ జిల్లాలో హైనా ఊర్లమీద పడింది. తిమ్మాపూర్ మండలం మల్లాపూర్లో హైనా సంచారం కలకలం రేపింది. అర్ధరాత్రి గ్రామంలోని కుక్కలను వేటాడింది. ఓ కుక్కపై దాడి చేసి నోట కర్చుకుంది. హైనా సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. భారీ చప్పుళ్లు, కేకలు వేడయంతో గుట్టలోకి పారిపోయింది. హైనా సంచారంపై ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. మల్లాపూర్ లోకి వచ్చిన అధికారులు..హైనా ఆనవాళ్లు సేకరించారు. రాత్రి వేళల్లో పొలాల్లోకి వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## బండి'ని తొలగించారని
# యువనేత ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

**కొనసాగుతున్న రాజీనామాల పర్వం!**



ఖమ్మం /హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను తొలగించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని అధిష్టానం నియమించిన సంగతి తెలిసిందే. దీంతో అధిష్టానం బండి వర్గం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతోంది. ఇప్పటికే ఒకరిద్దరు ముఖ్య అనుచరులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే.. బండిని పదవి నుంచి తొలగించారని తీవ్ర మనస్థాపానికి గురై బీజేపీ ఖమ్మం అర్బన్ ఉపాధ్యక్షుడు, యువనేత గజ్జల శ్రీనివాస్ ఆత్మహత్యకు యత్నించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మాహత్యాయత్నం చేశారు. శ్రీనివాస్ కనిపించకపోవడంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా.. ఫ్యాన్‌కు వేలాడుతున్న అతడ్ని చూసి హుటాహుటిన స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నేతలు ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాస్‌ను పరామర్శించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సమాచారం అందుకున్న బండి సంజయ్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం శ్రీనివాస్ చికిత్స పొందుతున్న ఆస్పత్రికి బండి వెళ్తారని తెలుస్తోంది. ఇక సెలవు అన్నా..!'నాపేరు గజ్జల శ్రీనివాస్.. ఖమ్మం భారతీయ జనతాపార్టీ అర్బన్ టౌన్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నాను. బండి సంజయ్ అన్నను అధ్యక్ష పదవి నుంచి తొలగించడం నాకు బాధాకరం. నేను జీర్ణించుకోలేకపోతున్నాను. అంతేకానీ నాకు ఎవరి మీదా కోపం కాదు. నేను అన్నమీద పెంచుకున్న ప్రేమతో ఆత్మహత్య చేసుకుంటున్నాను. జై బీజేపీ.. జై బండి సంజయ్ అన్నా.. ఇక సెలవు' అని సూసైడ్ నోట్‌లో శ్రీనివాస్ రాశారు.రాజీనామాల పర్వం!ఇదిలా ఉంటే.. బండిని పదవి నుంచి తొలగించడాన్ని జీర్ణించుకోలేక బీజేపీ నల్గొండ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వరరావు రావు తన పదవికి రాజీనామా చేశారు. 2023లో బీజేపీ అధికారం చేపట్టాలని దృఢ సంకల్పంతో పనిచేసినటువంటి, ఒక సమయంలో మతోన్మాదులు సంజయ్ ఇంటిపై రాళ్లు రువ్వి భయభ్రాంతులకు గురిచేసినా అదరక, బెదరక రెట్టింపు ఉత్సాహంతో పనిచేశారని రాజీనామా లేఖలో రాసుకొచ్చారు. బండి లాంటి నాయకుడు అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని.. ఆయన రాజీనామా తనను ఎంతో కలచి వేసిందని అందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు లేఖలో నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# బీఎండబ్ల్యూ ఓనర్ కు రూ.40 లక్షల ఖర్చు!

హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ఇంజినీరింగ్ టీమ్ చేసిన చిన్న తప్పిదం ఓ వాహనదారుడికి ఏకంగా రూ.40 లక్షల రూపాయల నష్టాన్ని తెచ్చిపెట్టింది. పరిస్థితి మరింత దిగజారితే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం నుంచి కారు ప్రయాణికులు బయటపడ్డారు. దీనిపై ఆ బాధితుడు ట్విట్టర్ వేదికగా కొన్ని సలహాలు ఇస్తూనే, జరిగిన ఘటన వివరాలు పోస్ట్ చేయగా వైరల్ అవుతున్నాయి. హైదరాబాద్ కు సంబంధించి ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. మాదాపూర్ కు చెందిన ఉదయ్ తేజ అనే ఆడిటర్ గత వారం గర్భవతి అయిన తన భార్య, డ్రైవర్‌తో కలిసి బీఎండబ్ల్యూలో ప్రయాణిస్తున్నారు. కోకాపేట సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న కారు వర్షపు నీటిలో చిక్కుకుపోయింది. గర్భవతి అయిన భార్యతో అర్ధరాత్రి సమయంలో మరో వాహనం కోసం వర్షపు నీటిలో ఎదురు చూశామని భయానక అనుభవాన్ని ట్వీట్ ద్వారా తెలిపారు. తనతో పాటు మరికొన్ని లగ్జరీ కార్లు ఓఆర్ఆర్ వద్ద వర్షపు నీటిలో చిక్కుకుపోయాయని పేర్కొన్నాడు.అక్కడ వర్షపు నీరు నిలిచిపోవడానికి కారణాలు తెలుపుతూ ఉదయ్ తేజ ఇంజినీరింగ్ టీమ్ పై సెటైర్లు వేశారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వేసిన ఇంజినీరింగ్ టీమ్ వర్షపు నీరు వెళ్లడానికి హోల్స్ పెట్టడం మరిచిపోయిందని తెలిపారు. గ్రేట్ ఇంజినీరింగ్ టీమ్ చేసిన తప్పిదం కారణంగా వర్షపు నీళ్లు అక్కడ నిలిచిపోతున్నాయని చెప్పారు. 12 బీఎండబ్ల్యూ కార్లు, 8 మెర్సిడెజ్ కార్లు వర్షపు నీటిలో చిక్కుకు పోయాయని, ఇది వాహనదారులకు కోట్ల రూపాయల నష్టాన్ని చేకూర్చిందని చెప్పారు.

2016లో తెలంగాణ ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు స్ట్రాటజిక్ నాలా డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌డీపీ) ను తీసుకొచ్చింది. అంటే ఇదేనా. నాలాలు నిర్మించడం మంచి పని. కానీ ఒక అడుగు ఎత్తు గోడ నిర్మిస్తే నాలాలోకి వర్షపు నీళ్లు ఎలా వెళతాయని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ ఏదైనా పరిష్కారం చూడాలని కోరారు. తన ఫ్రెండ్ కు కాల్ చేయగా, 10 నిమిషాల్లో వచ్చి పికప్ చేసుకున్నాడు. రాత్రి ఫ్రెండ్ ఇంట్లో తన భార్యను డ్రాప్ చేసి.. తరువాత తన డ్రైవర్ తో కలిసి కారు కోసం మళ్లీ ఓఆర్ఆర్ కు వచ్చినట్లు వెల్లడించారు. నీళ్లు ఎప్పుడు తగ్గుతాయా అని రాత్రి నుంచి ఉదయం వరకు ఎదురుచూశానని తెలిపారు. కారును రిపేర్ చేయడానికి ఇవ్వగా.. రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పేసరికి షాకయ్యారు. కారు ఇంజిన్ పూర్తిగా డ్యామేజీ అయిందని, కొత్త ఇంజిన్ మార్చాలని సూచించారని, పైగా కారు రిపేర్ పూర్తయ్యే వరకు 2 నెలలు టైమ్ పడుతుందని బాధితుడు ఉదయ్ తేజ ట్వీట్లలో రాసుకొచ్చారు. ఈ విషయంపై నగరవాసులు సీరియస్ గా స్పందిస్తున్నారు. ప్రభుత్వాన్ని మీలాంటి వారు ప్రశ్నిస్తే పరిస్థితులో మార్పు వస్తుందని కొందరు స్పందించారు. మరికొందరైతే దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి, వారి వద్ద నుంచి మీరు నష్టపోయిన నగదు వసూలు చేయాలని ఉదయ్ కి సూచించారు.

## పోడు,అసైన్డ్ భూములకూ పంట రుణాలివ్వాలి

**జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ**



జగిత్యాల -ప్రభాత సూర్యుడు : జగిత్యాల జిల్లాలో పట్టాలు పొందిన పోడు భూములు, ప్రభుత్వ అసైన్డ్ ల్యాండ్ రైతాంగానికి పంట రుణాలు కల్పించాలని కోరుతూ బుధవారం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి జిల్లా కలెక్టర్ కులేఖ రాశారు.. రాష్ట్రంలో ప్రభుత్వపరంగా యాజమాన్యకు హక్కులు కల్పించే పోడు భూములు ఇతర ప్రభుత్వ ఆసెండ్ ల్యాండ్ కు సంబంధించి, ఇతర సాధారణ పట్టా యాజమాన్యపు హక్కులు కలిగి ఉన్న వారికి కల్పించే సౌకర్యాలు అన్నీ కూడా కల్పించడం జరుగుతుందని, స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ వేదికగా ప్రకటించినప్పటికీ రాష్ట్రంలో గతంలో 2008- 2009 లో పంపిణీ చేయబడ్డ పోడు భూములకు సంబంధించి లేక ఉమ్మడి రాష్ట్రంలో అసైన్మెంట్ చేయబడిన ప్రభుత్వ రెవెన్యూ భూములకు సంబంధించి ధరణి పట్టాదారు పాసుబుక్ జారీ చేయబడినప్పటికీ రైతుబంధు ఆర్థిక సహాయం కల్పించ బడుతున్నప్పటికీ కేడిసిసిబి సహకార బ్యాంకులలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఇతర బ్యాంకులలో కూడా పంట రుణాలు ఇతర రుణాలు కల్పించలేకపోవుటతో రాష్ట్రంలోని దళిత ప్రధానంగా బలహీన వర్గాలు గిరిజన కుటుంబాలు పెట్టుబడులు సమకూర్చు కోలేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన, ఇట్టి అంశంపై గతంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ కి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ఏ విధమైన ఫలితం లభించక పోవుటతో ప్రత్యేకించి బీర్పూర్ రెవెన్యూ మండల్లో ప్రభుత్వ భూములు పట్టాలు పొందిన నిరుపేద వర్గాల రుణ సదుపాయం పొందుటలో ముఖ్యంగా కేడిసిసిబి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నుండి ఇబ్బందులు కొనసాగుతున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని కోడు పట్టాలు పొందిన వారికి లేక ప్రభుత్వ అసైన్డ్ భూముల పట్టాలు పొందిన వారికి పంట రుణాల కల్పనలో ఉన్నటువంటి ఇబ్బందులను తొలగించి నిరుపేద వర్గాలకు వ్యవసాయ పెట్టుబడులకు కావలసిన పంట రుణాలు కల్పించబడే విధంగా చర్యలు చేపట్టగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ వ్రాసిన లేఖలో ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

## జిహెచ్ఎంసి కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన రోనాల్డ్ రోస్



హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా రోనాల్డ్ రోస్ బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో జిహెచ్ఎంసి కమిషనర్ గా పని చేసిన లోకేష్ కుమార్ నుండి రోనాల్డ్ రోస్ బాధ్యతలు స్వీకరిం చారు. ఇంతకు ముందు ఫైనాన్స్ సెక్రటరీగా పని చేసిన రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసి కమిషనర్ ప్రభుత్వం నియమించింది.క్కడ జిహెచ్ఎంసి కమిషనర్ గా పని చేసిన లోకేష్ కుమార్ ను కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు రాష్ట్ర ఎన్నికల అడిషనల్ సిఇఓ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.నూతన కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తదనంతరం రోనాల్డ్ రోస్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిహెచ్ ఎంసి కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రోనాల్డ్ రాస్ ను, బదిలీ పై వెళుతున్న లోకేష్ కుమార్ ను ఆయా విభాగాల హెచ్ ఓ డి లు, జోనల్, డిప్యూటీ కమిషనర్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన రోనాల్డ్ రోస్ గతంలో మెదక్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ గా, ఫైనాన్స్ సెక్రెటరీ, గురుకుల పాఠశాల సెక్రటరీ గా జిహెచ్ఎంసి లో అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్‌గా పని చేశారు.ఈ సందర్భంగా ఈ.వి.డి.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఇ.ఎన్.సి జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడి, హెచ్ఆర్డిసిఎల్ సరోజినీ దేవి, ప్రాజెక్టు సి ఇ దేవానంద్, సి సి పి దేవేందర్ రెడ్డి, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, అడిషనల్ సి పి శ్రీనివాస్, హౌసింగ్ ఓ ఎస్ డి సురేష్ కుమార్, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజా, సి పి ఆర్ ఓ మహమ్మద్ ముర్తుజా, సెక్రటరీ లక్ష్మి, పీడి సౌజన్య, జాయింట్ కమిషనర్ శశి రేఖ వెంకట్ రెడ్డి, సంధ్య, ఎస్ ఈ లు వెంకటరమణ, విద్యాసాగర్, రవీందర్ రాజు, రత్నాకర్, అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, శంకర్ పి.ఆర్.ఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com